'రాజ్య సంస్కరణ' ఈ–పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 41 | శుక్రవారం | 25.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 41 | Friday | 25.9.2026 | Pages: 8 | Rate: 2

'రాజ్య సంస్కరణ' ఈ–పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..




## నాలుగేళ్లలో 111 మంది పార్టీ మారిన ప్రజాప్రతినిధులు

ఎన్నికలైన వెంటనే మరో పార్టీలోకి జంప్

## ఏఐపై మానవ నియంత్రణ ఉండాలి

• లేకుంటే ఇక అంతే సంగతులు • వైట్‌హౌస్‌లో షీ సంచలన వ్యాఖ్యలు




## 22ఏ నిషేధిత భూములపై కీలక నిర్ణయం

» రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్న ప్రభుత్వం

» తక్షణమే ఆదేశాలు అమలకు చర్యలు



అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు ఇచ్చిన మాట మేరకు 22ఏ భూముల సమస్యలకు వేగంగా పరిష్కారాలు చూపిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. న్యాయబద్ధమైన ఒక్క సెంటు భూమి విషయంలోనూ ప్రజలకు ఇబ్బంది కలిగించలేదని, భవిష్యత్‌లోనూ అలాంటి పరిస్థితి ఉండదని స్పష్టం చేసింది. (2లో..)

# సర్‌మని అంటుకుంది

ప్రత్యేక కథనం 7లో..



- అసంతృప్తి జ్వాల రాజుకుంది
- జ్ఞానేశ్వర్ మేడపై వేలాడుతున్న కత్తి
- డామేజ్ కంట్రోల్‌కు సీఈసీ కుస్తీ

ఓటు వేయబోయే ముందు ఓటరే ప్రశ్నించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందా? దేశ ఎన్నికల వ్యవస్థను నడిపించే ఎన్నికల సంఘం చుట్టూ ఇప్పుడు అసాధారణ పరిణామాలు కలకలం రేపుతున్నాయి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పద్నాలుగు సార్లు లిఖితపూర్వక అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న నివేదిక రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ఓటర్ల జాబితా సవరణ నుంచి ఫారం6 మార్పుల వరకు, డేటాబేస్ కేంద్రీకరణ నుంచి సాఫ్ట్‌వేర్ వినియోగం వరకు ఎన్నో ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం ఇవన్నీ సాధారణ అంతర్గత చర్చలేనని, తుది నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని చెబుతోంది. కానీ ప్రతిపక్షం వెనక్కి తగ్గడం లేదు. సీఈసీ తొలగింపునకు పార్లమెంటరీ చర్యకు సిద్ధమవుతోంది. రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేస్తుండగా, పలు రాష్ట్రాల్లో నిరసనలకు పిలుపులు వినిపిస్తున్నాయి. అసలు విభేదం ఎక్కడ మొదలైంది? సర్‌లో ఏం జరిగింది? ఎన్ని ఓటర్ల పేర్లు ప్రభావితమయ్యాయి? ఎన్నికల సంఘం చెబుతున్నదేంటి? కమిషనర్ల అభ్యంతరాల వెనుక ఉన్న పత్రాలు ఏమంటున్నాయి? దేశ ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఓటు హక్కు చుట్టూ ముసురుకున్న ఈ ప్రశ్నల పూర్తి కథనం ఇది.



## ఐబొమ్మ రవికి కోర్టులో డబుల్ షాక్

ఖాతాల నిర్వహణకు అనుమతి

పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' కేసులో మాజీ నిర్వాహకుడు ఇమ్మడి రవి దాఖలు చేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీజ్ చేసిన బ్యాంకు ఖాతాలను రవి తన సాధారణ అవసరాల కోసం ఉపయోగించుకునేందుకు న్యాయస్థానం అనుమతించింది. (2లో..)



## మూడో బిడ్డకు రూ.50 వేల ప్రోత్సాహకం

జనాభా తగ్గుదలపై పటేళ్ల కొత్త ప్రయత్నం

గుజరాత్‌లోని కచ్ కడ్వా పటిదార్ సమాజ్, కేకేపీఎస్ జనాభా తగ్గుదలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. సమాజానికి చెందిన దంపతులకు మూడో సంతానం కలిగితే రూ.50 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ అందించాలని నిర్ణయించింది.
(వివరాలు 2లో..)



## ఏటా లక్షల కోట్ల విలువైన బంగారం

గోల్డ్ దిగుమతులతో ప్రజలకే నష్టం

లెక్కలతో మైండ్ బ్లాంక్ చేసిన కోటక్ ఉదయ్

భారత్‌లో బంగారం కొనుగోళ్లు భారీగా ఉండటం వల్ల దేశంపై దిగుమతుల భారం పెరుగుతోందని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత్ దిగుమతి చేసుకునే బంగారం విలువ 88 నుంచి 90 బిలియన్ (వివరాలు 2లో..)

## క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

ఓటర్ల తొలగింపుపై ప్రియాంక ఆగ్రహం



వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితాల నుంచి సుమారు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించడం ద్వారా అన్యాయమైన ఎన్నికలకు అవకాశం కల్పించారని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై సీఈసీపై క్రిమినల్ కేసు నమోదు చేసి, దేశద్రోహం కింద విచారణ జరపాలని డిమాండ్ చేశారు. (వివరాలు 3లో..)

## మోదీ, షాపై దర్యాప్తు చేయాలి

సీఈసీ రాజీనామాకు రాహుల్ డిమాండ్



లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని మరోసారి డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో కీలక నిర్ణయాలపై అభ్యంతరాలు నమోదు చేసినట్లు వచ్చిన (వివరాలు 3లో..)




## జ్ఞానేశ్వర్ తొలగింపుపై విపక్షాల పోరు - రెండు సభల్లో కొత్తగా నోటీసులు

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తొలగింపునకు కొత్త నోటీసులు ఇవ్వాలని విపక్షాలు నిర్ణయించాయి. లోక్‌సభ, రాజ్యసభల్లో ఈ నోటీసులు తీసుకురావాలని భావిస్తున్నాయి. ఇప్పటికే ఏప్రిల్ 24న రాజ్యసభలో సమర్పించిన నోటీసు ఇంకా పెండింగ్‌లో ఉంది. ఎన్నికల కమిషన్‌లో తాజాగా వెలుగుచూసిన పరిణామాల నేపథ్యంలో మరిన్ని ఆరోపణలను చేర్చి కొత్త ప్రతిపాదన తీసుకురావాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. విపక్ష పార్టీల మధ్య దీనిపై చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలో ఇండియా కూటమి సమావేశం జరిగే అవకాశం ఉందని సమాచారం. (వివరాలు 3లో..)




## ఉన్నది కాస్తా.. ఊడింది..

## 'సుప్రీం' మంగళం పాడింది!

## అనర్హతపై సుప్రీం షాక్

ఫిరాయింపుపై కీలక తీర్పు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన అనర్హత తీర్పును సవాల్ చేస్తూ దానం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన కారణం కనిపించడం లేదని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా "ఆయా రామ్.. గయా రామ్.. ఫిర్ ఆయా రామ్" అంటూ జస్టిస్ బాగ్చీ మౌఖికంగా వ్యాఖ్యానించారు. తరచూ పార్టీలు మారే రాజకీయ నాయకులను సూచించేందుకు ఈ పదబంధాన్ని ఉపయోగిస్తారు. దానం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. (వివరాలు 2లో..)

## ఖైరతాబాద్‌లో ఖేల్ ఖతం

ఖైరతాబాద్ రాజకీయాల్లో ఒక్క తీర్పుతో కథ మలుపు తిరిగింది. బీఆర్ఎస్ టికెట్‌పై 2023లో ఎమ్మెల్యేగా గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టు విధించిన అనర్హతను సుప్రీంకోర్టు గురువారం సమర్థించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన కారణం లేదని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా మారి ఉప ఎన్నికకు మార్గం సుగమమైంది. న్యాయపోరాటం ముగిసిన చోటే అసలు రాజకీయ పోరు మొదలుకానుంది. కాంగ్రెస్ మళ్లీ దానానికే అవకాశం ఇస్తుందా? బీఆర్ఎస్ పాత సీటును తిరిగి దక్కించుకునేందుకు ఎవరిని బరిలోకి దింపుతుంది? బీజేపీ వ్యూహం ఎలా ఉండబోతోంది? ఇప్పటికే ఎన్నికలకు సిద్ధమని దానం ప్రకటించడంతో ఖైరతాబాద్‌లో రాజకీయ కదలికలు వేగం పుంజుకున్నాయి. ఒకవైపు పదో షెడ్యూల్‌పై సుప్రీం తీర్పు.. మరోవైపు ప్రజల తీర్పు కోసం సిద్ధమవుతున్న దానం. ఎమ్మెల్యే పదవి కోల్పోయిన నేతకు ఇదే నియోజకవర్గం నుంచి తిరిగి ప్రజల ముందుకు వెళ్లే అవకాశం ఇప్పుడు ఎదురైంది. కోర్టులో ముగిసిన ఈ అధ్యాయం.. ఖైరతాబాద్ ఓటర్ల మధ్య ఎలాంటి కొత్త రాజకీయ కథను రాయబోతోంది?

## కోర్టు తీర్పును స్వాగతించిన దానం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన అనర్హత తీర్పును సవాలు చేస్తూ దానం దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా స్పష్టమైంది. తీర్పుపై స్పందించిన దానం నాగేందర్ దాన్ని స్వాగతించారు. రాబోయే ఉపఎన్నికను ఎదుర్కొనేందుకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఎన్నికలను ఎదుర్కోవడం తనకు కొత్తేమీ కాదని, మరోసారి ప్రజల్లోకి వెళ్లి పోటీ చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్‌లో తిరిగి విజయం సాధిస్తాననే నమ్మకాన్ని కూడా ఆయన వ్యక్తం చేశారు. (వివరాలు 2లో..)

## దానం తీర్పుపై బీఆర్ఎస్ హర్షం

### సుప్రీం తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు: కేటీఆర్

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ స్వాగతించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ.. ఈ తీర్పు రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి తప్పించుకునేందుకు దానం చేసిన ప్రయత్నానికి సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసిందన్నారు. హైకోర్టు ఇచ్చిన అనర్హత తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి కారణం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని కేటీఆర్ తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలు మూడు సంవత్సరాల మోసం, నెరవేరని హామీలు, పాలనపై త్వరలో తమ తీర్పు ఇస్తారని అన్నారు.






## సీఈసీపై కోర్టు ధిక్కరణ పిటిషన్

అటార్నీ జనరల్ అనుమతికి దరఖాస్తు

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించేందుకు సుప్రీంకోర్టు న్యాయవాది బ్రజేష్ సింగ్ అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా అనుమతి కోరారు. ఎన్నికల కమిషన్‌లో ముగ్గురు సభ్యుల మధ్య ఏకాభిప్రాయం దెబ్బతిన్నట్లు వచ్చిన మీడియా కథనాల ఆధారంగా ఈ చర్యకు సిద్ధమయ్యారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనాన్ని ప్రస్తావిస్తూ, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సార్లు లిఖితపూర్వక అభ్యంతరాలు వ్యక్తం చేశారని న్యాయవాది పేర్కొన్నారు.



## ఎన్నికల సంస్కరణలపై సీజేపీ సమరం

ఓటు హక్కు రక్షణే లక్ష్యంగా ఉద్యమం

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఎన్నికల సంస్కరణల అంశాన్ని ప్రధానంగా తీసుకోవాలని నిర్ణయించింది. ఎన్నికల కమిషన్ పనితీరుపై తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో పార్టీ కీలక ప్రకటన చేసింది. సెప్టెంబర్ 24న జరగాల్సిన కార్యక్రమాలను రద్దు చేసి, ఢిల్లీలో మధ్యాహ్నం 12 గంటలకు "భారత ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయడం" పేరుతో సీజేపీ నాయకత్వం మీడియా సమావేశం నిర్వహించనుంది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే "ఎలక్షన్ కమిషన్ లీక్ కరో" అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.
(వివరాలు 3లో..)

## ఐఐటీ ముంబై విద్యార్థి తల్లిదండ్రుల దీక్ష

సాహిల్ మరణంపై ఆజాద్ మైదాన్‌లో పోరు

ఐఐటీ బాంబే విద్యార్థి సాహిల్ వాకోడే మృతిపై నిరసనలు కొనసాగుతున్నాయి. సాహిల్ తల్లిదండ్రులు గురువారం ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో నిరాహార దీక్ష ప్రారంభించారు. తమ కుమారుడిని వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తండ్రి రవీంద్ర డిమాండ్ చేశారు. సాహిల్ తనకు సంస్థలో పలుమార్లు కుల వివక్ష ఎదురైందని చెప్పేవాడని ఆయన తెలిపారు.
(వివరాలు 3లో..)

## సాహిల్ కుటుంబానికి రాహుల్ అండ

17 నిమిషాల వీడియో కాల్‌తో భరోసా




ఐఐటీ బాంబే విద్యార్థి సాహిల్ వాకోడే తల్లిదండ్రులతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. తమ కుమారుడి మరణంపై న్యాయం కోసం చేస్తున్న పోరాటంలో అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వాషిమ్ జిల్లా నుంచి ముంబైకి వస్తున్న సమయంలో రాహుల్ వీడియో కాల్ ద్వారా సాహిల్ తల్లిదండ్రులు రవీంద్ర, సోనాలి వాకోడేతో మాట్లాడినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

# దానం అనర్హతపై సుప్రీం షాక్

## ఫిరాయింపుపై సుప్రీం కీలక తీర్పు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన అనర్హత తీర్పును సవాల్ చేస్తూ దానం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన కారణం కనిపించడం లేదని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా "ఆయా రామ్.. గయా రామ్.. ఫిర్ ఆయా రామ్" అంటూ జస్టిస్ బాగ్చి మౌఖికంగా వ్యాఖ్యానించారు. తరచూ పార్టీలు మారే రాజకీయ నాయకులను సూచించేందుకు ఈ పదబంధాన్ని ఉపయోగిస్తారు. దానం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు.

**లోక్‌సభ ఎన్నికలతో మొదలైన వివాదం**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న సమయంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో దానం నాగేందర్ కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీంతో ఆయన పార్టీ ఫిరాయింపుకు పాల్పడ్డారంటూ అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ ఏడాది మార్చి 11న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అనర్హత పిటిషన్లను తిరస్కరించగా, ఆ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి దానం ఎమ్మెల్యేగా అనర్హుడని హైకోర్టు ప్రకటించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది. బీజేపీ శాసనసభాపక్ష నేత అలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. పదో షెడ్యూల్‌లోని ఫిరాయింపుల నిరోధక నిబంధనల ప్రకారం దానాన్ని అనర్హుడిగా ప్రకటించాలని వారు కోరారు.

# సుప్రీం తీర్పును స్వాగతించిన దానం



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన అనర్హత తీర్పును సవాలు చేస్తూ దానం దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా స్పష్టమైంది. తీర్పుపై స్పందించిన దానం నాగేందర్ దాన్ని స్వాగతించారు. రాబోయే ఉపఎన్నికను ఎదుర్కొనేందుకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఎన్నికలను ఎదుర్కోవడం తనకు కొత్తేమీ కాదని, మరోసారి ప్రజల్లోకి వెళ్లి పోటీ చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్‌లో తిరిగి విజయం సాధిస్తాననే నమ్మకాన్ని కూడా ఆయన వ్యక్తం చేశారు.

**బీఆర్ఎస్, బీజేపీపై దానం ఎదురుదాడి**

తనపై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీలకు విమర్శించే హక్కు లేదని దానం నాగేందర్ అన్నారు. గతంలో ఆయా పార్టీలు తీసుకున్న నిర్ణయాలను కూడా పరిశీలించుకోవాలని సూచించారు. మరోవైపు బీఆర్ఎస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించారు. రాష్ట్రంలోని ఇతర పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలోనూ రాజకీయ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజల గొంతును అణచివేస్తున్నారని ఆరోపిస్తూ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. అన్ని ఖాళీ స్థానాలకు ఎన్నికలు వస్తాయని వ్యాఖ్యానించారు. బీజేపీ నేత కరుణాసాగర్ కూడా తీర్పును స్వాగతించారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ టికెట్ నుంచి కాంగ్రెస్ వరకు**

2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ నుంచి గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఓడిపోయినా ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగారు. పార్టీ మార్పు ద్వారా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారని, పదో షెడ్యూల్ కింద అనర్హత వర్తిస్తుందని పలువురు హైకోర్టును ఆశ్రయించారు. తొలుత అసెంబ్లీ స్పీకర్ అనర్హత పిటిషన్లను తిరస్కరించారు. దీనిపై హైకోర్టులో సవాలు చేయగా, డివిజన్ బెంచ్ స్పీకర్ నిర్ణయాన్ని కొట్టివేసి దానం నాగేందర్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించింది. ఖైరతాబాద్ స్థానం ఖాళీగా ఉందని, కొత్త ఎన్నిక నిర్వహించాల్సిందేనని స్పష్టం చేసింది. ఆయన అనర్హతకు 2024 ఏప్రిల్ 23ను అమలు తేదీగా కోర్టు పేర్కొంది.

# నాలుగేళ్లలో 111 మంది

- ప్రజాప్రతినిధులు పార్టీ మారారు
- ఎన్నికలైన వెంటనే మరో పార్టీలోకి జంప్



2022 నుంచి 2026 మధ్య ఎన్నికల్లో గెలిచిన తర్వాత 111 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ రాజకీయ పార్టీలు మార్చినట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ విశ్లేషణ వెల్లడించింది. ఇందులో 26 మంది లోక్‌సభ ఎంపీలు, 7 మంది రాజ్యసభ సభ్యులు, 78 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ వివరాలు 2022 2026 మధ్య జరిగిన ఎన్నికలు, ఉపఎన్నికల ఆధారంగా రూపొందించిన నివేదికలో ఉన్నాయి. రాష్ట్రాల వారీగా చూస్తే నాగాలాండ్‌లో 32 మంది పార్టీ మారగా, పశ్చిమ బెంగాల్‌లో 20 మంది పార్టీ మారారు. దీంతో ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు తర్వాత కూడా పలుచోట్ల రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి.

**ఎన్‌డీపీపీ, టీఎంసీ, కాంగ్రెస్ నుంచే 64 మంది**

పార్టీల వారీగా చూస్తే ఎన్‌డీపీపీ నుంచి 25 మంది, తృణమూల్ కాంగ్రెస్ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి 19 మంది ఇతర పార్టీల్లోకి వెళ్లారు. ఈ మూడు పార్టీలకు చెందినవారే మొత్తం పార్టీ మారిన 111 మందిలో 64 మంది అంటే 58 శాతంగా ఉన్నారు. వీరితో పాటు బీఆర్ఎస్ నుంచి 9 మంది, ఆప్ నుంచి 7 మంది, ఎన్సీపీ నుంచి 7 మంది, శివసేన (యూబీటీ) నుంచి 6 మంది, జేడీయూ నుంచి 5 మంది, ఎన్‌పీపీ నుంచి 4 మంది పార్టీ మారినట్లు నివేదిక తెలిపింది. ఎన్నికల తర్వాత ప్రజాప్రతినిధులు పార్టీ మారడం కొన్ని రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసిందని ఏడీఆర్ పేర్కొంది.

**ఎన్‌పీఎఫ్, బీజేపీ వైపు ఎక్కువ మంది**

ఇతర పార్టీల నుంచి ప్రజాప్రతినిధులను చేర్చుకున్న పార్టీల జాబితాలో నాగా పీపుల్స్ ఫ్రంట్ 32 మందితో ముందుంది. తర్వాత బీజేపీ 29 మందిని, నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా 20 మందిని తమ పార్టీల్లో చేర్చుకున్నాయి. ఈ పార్టీ పూర్తి పశ్చిమ బెంగాల్.. హౌరా కేంద్రంగా నమోదైన ఒక గుర్తింపు లేని ప్రాంతీయ రాజకీయ పార్టీ. ఈ పార్టీలో తృణమూల్ నేతలు ఈ పార్టీలోనే విలీనం కావడాన్ని గమనించాల్సి ఉంది. కాంగ్రెస్ 9 మంది, శివసేన 8 మంది, ఎన్‌పీపీ 6 మంది, పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ 4 మందిని చేర్చుకున్నాయి. మొత్తం 111 మందిలో ఎన్‌పీఎఫ్, బీజేపీ, ఎన్‌సీపీఐలో చేరినవారి సంఖ్య 81, అంటే 73 శాతంగా ఉంది.

**ప్రభుత్వాలపై కూడా ప్రభావం**

ఏడీఆర్ నివేదిక ప్రకారం కొన్ని రాష్ట్రాల్లో ఎమ్మెల్యేల పార్టీ మార్పులు ప్రభుత్వాల పతనానికి లేదా అధికార సమీకరణాల మార్పుకు కారణమయ్యాయని పేర్కొంది. నాగాలాండ్‌లో 32 మంది పార్టీ మారడం అత్యధికంగా నమోదైంది. పశ్చిమ బెంగాల్‌లో 20 మంది మారారు. తెలంగాణలోనూ పార్టీ మార్పులు అసెంబ్లీ రాజకీయాలపై ప్రభావం చూపిన సందర్భాలు నమోదయ్యాయి. మొత్తంగా చూస్తే, ఎన్నికల తర్వాత ప్రజాప్రతినిధుల పార్టీ మార్పులు కేవలం వ్యక్తిగత రాజకీయ ప్రయాణానికే పరిమితం కాకుండా శాసనసభల్లో బలాబలాలు, ప్రభుత్వాల స్థిరత్వం, ప్రతిపక్షాల సంఖ్యాబలంపై కూడా ప్రభావం చూపినట్లు ఏడీఆర్ విశ్లేషణ పేర్కొంది.

# 22ఏ నిషేధిత భూములపై కీలక నిర్ణయం

- రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్న ప్రభుత్వం
- తక్షణమే ఆదేశాలు అమలకు చర్యలు



అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు ఇచ్చిన మాట మేరకు 22ఏ భూముల సమస్యలకు వేగంగా పరిష్కారాలు చూపిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. న్యాయబద్ధమైన ఒక్క సెంటు భూమి విషయంలోనూ ప్రజలకు ఇబ్బంది కలిగించలేదని, భవిష్యత్‌లోనూ అలాంటి పరిస్థితి ఉండదని స్పష్టం చేసింది. 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ సంస్థల అనుమతులు పొందిన ఆస్తులకు రిజిస్ట్రేషన్ అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. చట్టబద్ధమైన అనుమతులతో అభివృద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు, ఫ్లాట్లను నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించింది.

**జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలు**

దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఏ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. జిల్లా స్థాయిలో సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా రిజిస్ట్రార్, హెచ్‌ఎండీఏ, పురపాలక, గ్రామీణ స్థానిక సంస్థల ప్రతినిధులు ఈ కమిటీల్లో సభ్యులుగా ఉంటారు. ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను కమిటీలు పరిశీలించి పరిష్కరించనున్నాయి.

**పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు**

22ఏ సమస్యల పరిష్కారంలో ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం ఉదాహరణగా చూపింది. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లోని దాదాపు 64 కాలనీల ఇళ్ల క్రమబద్ధీకరణకు జీవో 118 ప్రకారం మెమో జారీ చేసింది. అలాగే దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి కార్మికుల ఇళ్ల క్రమబద్ధీకరణకు జీవో 76 ద్వారా పరిష్కారం చూపే దిశగా నిర్ణయం తీసుకుంది. భూమి, ఇళ్ల సమస్యలపై ప్రజలు సంవత్సరాల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితికి ముగింపు పలకడమే లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఐబొమ్మ రవికి కోర్టులో డబుల్ షాక్

## ఖాతాల నిర్వహణకు కోర్టు అనుమతి



పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' కేసులో మాజీ నిర్వాహకుడు ఇమ్మడి రవి దాఖలు చేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీజ్ చేసిన బ్యాంకు ఖాతాలను రవి తన సాధారణ అవసరాల కోసం ఉపయోగించుకునేందుకు న్యాయస్థానం అనుమతించింది. దీంతో ఖాతాల్లో రోజువారీ లావాదేవీలు నిర్వహించుకునే అవకాశం ఆయనకు లభించింది. అయితే ఖాతాల్లో ఫ్రీజ్ చేసిన సుమారు రూ.3 కోట్ల నగదును విడుదల చేయాలన్న అభ్యర్థనకు కోర్టు అంగీకరించలేదు. బ్యాంకు ఖాతాలు సీజ్ కావడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని రవి తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఈ నేపథ్యంలో ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయడంతో పాటు అందులో ఉన్న నగదును కూడా విడుదల చేయాలని పిటిషన్‌లో కోరారు.

**రూ.3 కోట్లపై మాత్రం ఊరట లేదు**

పిటిషన్‌ను పరిశీలించిన నాంపల్లి న్యాయస్థానం ఖాతాలను ఆపరేట్ చేసుకునేందుకు అనుమతిస్తూ, వాటిలో ఉన్న రూ.3 కోట్ల మొత్తాన్ని మాత్రం ప్రస్తుతం విడుదల చేయరాదని స్పష్టం చేసింది. ఐబొమ్మ పైరసీ కేసులో రవి అరెస్టయి అనంతరం బెయిల్‌పై విడుదలయ్యారు. దర్యాప్తులో భాగంగా ఆయన బ్యాంకు ఖాతాలు, ఆస్తుల డిపాజిట్లను పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో తెలంగాణ హైకోర్టు ఫిబ్రవరిలో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. చార్జిషీట్ దాఖలు చేసే వరకు దర్యాప్తు అధికారిని ప్రతిరోజూ కలవడం, పాస్‌పోర్టు అప్పగించడం, పైరసీకి సంబంధించిన ఆన్‌లైన్ వేదికలను నిర్వహించకపోవడం, సాక్షులు లేదా సహ నిందితులను సంప్రదించకపోవడం వంటి షరతులు విధించింది. తాజా నాంపల్లి కోర్టు ఆదేశాలతో ఖాతాల నిర్వహణకు అవకాశం వచ్చినా రూ.3 కోట్ల నిధులపై మాత్రం రవికి ప్రస్తుతానికి ఉపశమనం దక్కలేదు.

# దానం తీర్పుపై బీఆర్ఎస్ హర్షం

## సుప్రీం తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు: కేటీఆర్





ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ స్వాగతించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ.. ఈ తీర్పు రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి తప్పించుకునేందుకు దానం చేసిన ప్రయత్నానికి సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసిందన్నారు. హైకోర్టు ఇచ్చిన అనర్హత తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి కారణం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని కేటీఆర్ తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలు మూడు సంవత్సరాల మోసం, నెరవేరని హామీలు, పాలనపై త్వరలో తమ తీర్పు ఇస్తారని అన్నారు.

**రేవంత్‌కు సుప్రీం తీర్పు చెంపపెట్టు: హరీశ్**

దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తూ.. ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న రేవంత్‌రెడ్డికి ఈ తీర్పు చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. ఫిరాయింపుదారులను కాపాడే ప్రయత్నాలు బయటపడ్డాయని ఆరోపిస్తూ, పార్టీ మారిన మిగిలిన ఎమ్మెల్యేల విషయంలోనూ ఇదే పరిణామం ఎదురవుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**ఫిరాయింపులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి**

బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు సైతం తీర్పుపై స్పందిస్తూ కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి కాంగ్రెస్ మాట్లాడుతూనే ఉంటుందని, రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా 'సంవిధాన్ బచావో' నినాదం చేస్తున్నారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. దానం అనర్హత విషయంలో బీజేపీ క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ సాగించిన న్యాయపోరాటం ఫలితంగానే అనర్హత అమలైందని పేర్కొన్నారు. ఫిరాయింపులపై నిజంగా పోరాడాలనే ఉద్దేశం బీజేపీకి ఉంటే, కాంగ్రెస్‌లో చేరిన మిగిలిన ఎనిమిది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఎందుకు పిటిషన్లు వేయలేదని ప్రశ్నించారు.

# ఏటా లక్షల కోట్ల విలువైన బంగారం

- బంగారం దిగుమతులతో ప్రజలకే నష్టం
- లెక్కలతో మైండ్ బ్లాంక్ చేసిన కోటక్ ఉదయ్



భారత్‌లో బంగారం కొనుగోళ్లు భారీగా ఉండటం వల్ల దేశంపై దిగుమతుల భారం పెరుగుతోందని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత్ దిగుమతి చేసుకునే బంగారం విలువ 88 నుంచి 90 బిలియన్ డాలర్లకు చేరవచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం చమురు ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు రూపాయి విలువ తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో బంగారం కోసం విదేశాలకు చెల్లించే డబ్బు కూడా పెరిగితే దేశ ఆర్థిక పరిస్థితిపై అదనపు భారం పడుతుందని చెప్పారు. భారత కుటుంబాల వద్ద పెద్ద మొత్తంలో బంగారం ఉందని, అది వ్యక్తిగత సంపదగా ఉన్నప్పటికీ దేశ ఆర్థికాభివృద్ధికి నేరుగా ఉపయోగపడటం లేదని కోటక్ పేర్కొన్నారు. బంగారం కొనుగోళ్లను తగ్గించాలన్నది కాదు.. ఈ సంపదను దేశ ఆర్థిక వ్యవస్థకు ఎలా ఉపయోగపడేలా చేయాలన్నదే ఆలోచించాల్సిన అంశమని ఆయన సూచించారు.

**దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం**

2025-26లో భారత్ కరెంట్ ఖాతా లోటు సుమారు 25 బిలియన్ డాలర్లు ఉండగా, బంగారం దిగుమతుల విలువ 72 బిలియన్ డాలర్లుగా ఉందని కోటక్ తెలిపారు. బంగారాన్ని పక్కన పెడితే భారత్‌కు కరెంట్ ఖాతాలో మిగులు ఉండేదన్నారు. చమురు ధరలు సగటున 90 డాలర్ల వద్ద ఉంటే ఈ ఏడాది కరెంట్ ఖాతా లోటు 60 బిలియన్ డాలర్లకు చేరవచ్చని అంచనా వేశారు. బంగారం సమస్యపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయవచ్చని సూచించారు. దేశ ఆర్థిక లోటును కూడా తగ్గించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**దేశంలో ఉత్పత్తి పెరగాలి**

ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న ఇబ్బందులను భారత్ అవకాశంగా మార్చుకోవాలని కోటక్ సూచించారు. దేశానికి అవసరమైన వస్తువులు, సేవలను వీలైనంత వరకు భారత్‌లోనే తయారు చేయాలని అన్నారు. ప్రపంచానికి అవసరమైన ఉత్పత్తులను ఎక్కువగా ఎగుమతి చేస్తే విదేశాలపై ఆధారపడటం తగ్గుతుందని చెప్పారు. షేర్ మార్కెట్లు కేవలం కొనుగోళ్లు, అమ్మకాలకే పరిమితం కాకుండా కొత్త పరిశ్రమలకు పెట్టుబడులు అందించేలా పనిచేయాలని సూచించారు. ఆర్థిక సంస్థలను కాపాడుతూనే తప్పు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేస్తే ప్రపంచ ఆర్థిక సవాళ్లను భారత్ మరింత సమర్థంగా ఎదుర్కోగలదని కోటక్ పేర్కొన్నారు.

# మూడో బిడ్డకు రూ.50 వేల ప్రోత్సాహకం

## జనాభా తగ్గుదలపై పటేళ్ల కొత్త ప్రయత్నం



గుజరాత్‌లోని కచ్ కడ్వా పటిదార్ సమాజ్, కేకేపీఎస్ జనాభా తగ్గుదలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. సమాజానికి చెందిన దంపతులకు మూడో సంతానం కలిగితే రూ.50 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ అందించాలని నిర్ణయించింది. దక్షిణ గుజరాత్ జోనల్ సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చ జరిగింది. యువ దంపతుల్లో చాలామంది ఒక్క సంతానానికే పరిమితం కావడం, కొందరు పిల్లలను కనకపోవడం వల్ల సమాజ జనాభా తగ్గుతోందని నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు కేకేపీఎస్ దక్షిణ గుజరాత్ ఉపాధ్యక్షుడు జవేరీలాల్ రమణి వెల్లడించారు. మూడో బిడ్డకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు నగదు ప్రయోజనంతో పాటు ప్రత్యేక కార్యక్రమంలో సన్మానం కూడా చేయనున్నారు.

**17 వేల జనాభాపై ఆందోళన**

దక్షిణ గుజరాత్‌లో కేకేపీఎస్ జనాభా సుమారు 17 వేలుగా ఉందని, అది క్రమంగా తగ్గుతోందని సమాజ నాయకులు తెలిపారు. జనాభాతో పాటు వయసుల సమతుల్యతపై కూడా ఆందోళన ఉందన్నారు. కులం, మతం, వయో నిర్మాణంలో ఏర్పడుతున్న అసమతుల్యతను దృష్టిలో ఉంచుకుని యువతను ఎక్కువ మంది పిల్లల వైపు ప్రోత్సహించాలనేది పథకం ఉద్దేశమని చెప్పారు. సమాజంలో ఇప్పటికే బాలిక జననాన్ని ప్రోత్సహించే 'దిక్రీ జన్మ వధామణా' కార్యక్రమంతో పాటు ఆదాయం లేని కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే పథకాలు అమల్లో ఉన్నాయి. అఖిల భారత కేకేపీఎస్ ఉపాధ్యక్షుడు రమేష్ పరాసియా ఈ విషయాలను వెల్లడించారు.

**పార్సీ సమాజంలోనూ ఇలాంటి పథకం**

మూడో సంతానాన్ని ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమం పార్సీ సమాజంలోనూ అమల్లో ఉంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 39 మంది దంపతులు ఆ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నట్లు సూరత్ పార్సీ పంచాయత్ అధ్యక్షుడు డాక్టర్ హోమీ దూధ్‌వాలా తెలిపారు. మూడో బిడ్డను కనే దంపతులకు నెలకు రూ.5 వేల చొప్పున, ఆ పిల్లవాడికి 25 ఏళ్లు వచ్చే వరకు ఆర్థిక సహాయం అందించే విధానం అక్కడ

# బ్లాక్ మ్యాజిక్ ఆరోపణలు

- కాంగ్రెస్ నేతలపై పరువు నష్టం కేసు
- నాంపల్లి కోర్టులో హరీశ్ రావు వాంగ్మూలం




బ్లాక్ మ్యాజిక్ చేశారంటూ తనపై కాంగ్రెస్ నేతలు బి. మహేశ్‌కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్ చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో తన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. తాను దాఖలు చేసిన పరువు నష్టం పిటిషన్‌ను కోర్టు స్వీకరించిన నేపథ్యంలో గురువారం హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ నెల 30న మహేశ్‌కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్ వాంగ్మూలాలను కోర్టు నమోదు చేయనుంది. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు లేవని హరీశ్‌రావు పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం చేస్తే ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలు ప్రభుత్వ హామీలు, ప్రజా సమస్యలపై వస్తున్న ప్రశ్నల నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీ ప్రివిలేజ్ ఫిర్యాదులపై చర్యలు లేకపోవడాన్ని, అసెంబ్లీ ఏర్పాటై 33 నెలలు గడిచినా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగకపోవడాన్ని ప్రశ్నించారు.

# ఏఐపై మానవ నియంత్రణ ఉండాలి

- లేకుంటే ఇక అంతే సంగతులు
- వైట్‌హౌస్‌లో షీ సంచలన వ్యాఖ్యలు



అమెరికా-చైనా సంబంధాల్లో కృత్రిమ మేధస్సు మరోసారి ప్రధాన చర్చగా మారింది. వైట్ హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ సందర్భంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధస్సు అభివృద్ధి ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడాలని, అది ఎప్పటికీ మానవ నియంత్రణలోనే ఉండేలా అమెరికా, చైనా బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ రంగంలో రెండు దేశాలకు సామర్థ్యంతో పాటు బాధ్యత కూడా ఉందని షీ పేర్కొన్నారు.

**నియంత్రణపై స్పష్టత లేదు**

కృత్రిమ మేధస్సును మానవ నియంత్రణలో ఉంచాలని షీ చెప్పినా, అందుకు అవసరమైన నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై స్పష్టమైన ప్రణాళిక వెల్లడించలేదు. ట్రంప్-షీ భేటీలో ఈ సాంకేతికత ప్రధాన అంశంగా నిలిచినా, ఇరు దేశాల మధ్య ప్రత్యేక ఒప్పందం ప్రకటించలేదు. ఇదే సమయంలో కొత్త నియంత్రణలు తీసుకురావడంపై ట్రంప్ ఆసక్తి చూపడం లేదని, ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని కోరుతున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు.

**భద్రతపై పెరుగుతున్న ఆందోళన**

అమెరికా-చైనా మధ్య సాంకేతిక పోటీ తీవ్రంగా కొనసాగుతున్న నేపథ్యంలో దాని వల్ల ఎదురయ్యే ప్రమాదాలపై సమాచార మార్పిడి, అత్యవసర సంప్రదింపుల వ్యవస్థపై కూడా చర్చ జరిగింది. ఇరు దేశాల ఆర్థిక మంత్రుల స్థాయి సమావేశంలో సాంకేతిక ఘటనలపై పరస్పరం సమాచారం ఇచ్చుకునే కొత్త విధానాన్ని అమెరికా ప్రతిపాదించినట్లు సమాచారం. సైబర్ దాడులు, కీలక మౌలిక వసతులపై ముప్పు వంటి అంశాలు ఇరు దేశాలకు ఆందోళన కలిగిస్తున్నాయి.

**సాంకేతిక పోటీకి కొత్త మలుపు**

వైట్ హౌస్ చర్చలు భద్రతపై ఇరు దేశాల మధ్య సంభాషణకు అవకాశం కల్పించినా, అంతర్జాతీయ స్థాయి నియంత్రణ వ్యవస్థపై ఏకాభిప్రాయం ఇంకా కుదరలేదు. ఆధిపత్యం కోసం అమెరికా, చైనా మధ్య పోటీ కొనసాగుతున్న వేళ మానవ నియంత్రణ, భద్రత, బాధ్యత అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గతంలోనూ ఈ సాంకేతికత భద్రతపై ఇరు దేశాలు చర్చలకు అంగీకరించినా, ఆ దిశలో పురోగతి నెమ్మదిగానే సాగింది.

# మోదీ, షాపై దర్యాప్తు చేయాలి

**▪ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి ▪ సీఈసీ రాజీనామాపై రాహుల్ డిమాండ్**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని మరోసారి డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో కీలక నిర్ణయాలపై అభ్యంతరాలు నమోదు చేసినట్లు వచ్చిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. ఓటర్ల జాబితాల సర్‌తో పాటు పలు నిర్ణయాలు తమకు తెలియకుండానే పూర్తి కమిషన్ పేరుతో తీసుకున్నారనే ఆరోపణలు ఈ వివాదానికి కేంద్రంగా నిలిచాయి.

### మోదీ, షాపై దర్యాప్తు చేయాలన్న రాహుల్

"వోట్ చోరీ" వ్యవహారంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక పాత్రధారులని రాహుల్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై వారిపైనా దర్యాప్తు జరగాల్సి ఉంటుందని ఆయన అన్నారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పదేపదే ఓటు అక్రమాల అంశాన్ని లేవనెత్తిన తరువాతే ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సీఈసీ నిర్ణయాలను ప్రశ్నించడం ప్రారంభించారని రాహుల్ పేర్కొన్నారు.

### ఓటు నుంచి రాజ్యాంగం వరకు

ఓటే భారత ప్రజాస్వామ్యానికి పునాది అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఓటును రక్షించాల్సిన సంస్థ అని, ఓటు హక్కు దెబ్బతింటే దాని ప్రభావం రాజ్యాంగం, చట్టాలు, ప్రజాస్వామ్య సంస్థలపై పడుతుందని ఆయన వాదించారు. దీనినే ఆయన "వోట్ చోరీ, కానూన్ చోరీ, సంస్థా చోరీ"గా పేర్కొన్నారు. 2024 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని తాను "100 శాతం నమ్ముతున్నానని" రాహుల్ ఆరోపించారు. ఇవి ఆయన చేసిన రాజకీయ ఆరోపణలు; ఎన్నికల సంఘం మాత్రం సర్‌కు సంబంధించిన నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నామని గతంలో స్పష్టం చేసింది.

### యాంటీ ఇన్‌కంబెన్సీపై ప్రశ్నలు

హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో గతంలో ప్రభుత్వాలు మారుతూ వచ్చిన విషయాన్ని రాహుల్ ప్రస్తావించారు. సాధారణంగా ప్రభుత్వాలపై యాంటీ ఇన్‌కంబెన్సీ ప్రభావం ఉంటుందని, అయితే బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా విషయంలో అది ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్నను లేవనెత్తారు. ఇందిరా గాంధీ 1971 బంగ్లాదేశ్ యుద్ధం తర్వాత ప్రజాదరణ ఉన్నప్పటికీ కొద్ది కాలానికే యాంటీ ఇన్‌కంబెన్సీ ఎదుర్కొన్న విషయాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు.

### "అప్రూవర్‌గా మారండి" పిలుపు

జ్ఞానేశ్ కుమార్ తన పదవిని తీవ్రంగా పరిశీలించి "అప్రూవర్‌గా మారడం" జాతీయ ప్రయోజనానికి సంబంధించిన చర్య అవుతుందని రాహుల్ సూచించారు. ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసిన వారిపై భవిష్యత్తులో చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తుంటే చూస్తూ మౌనంగా ఉండదని స్పష్టం చేశారు. మరోవైపు బీజేపీ రాహుల్ ఆరోపణలను తిరస్కరించింది. బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆయన మీడియా సమావేశాన్ని "డ్యాంప్ స్క్విబ్"గా అభివర్ణిస్తూ విమర్శించారు.







## సాహిల్ కుటుంబానికి రాహుల్ అండ

### 17 నిమిషాల వీడియో కాల్‌తో భరోసా

ఐఐటీ బాంబే విద్యార్థి సాహిల్ వాకోడే తల్లిదండ్రులతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. తమ కుమారుడి మరణంపై న్యాయం కోసం చేస్తున్న పోరాటంలో అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వాషిమ్ జిల్లా నుంచి ముంబైకి వస్తున్న సమయంలో రాహుల్ వీడియో కాల్ ద్వారా సాహిల్ తల్లిదండ్రులు రవీంద్ర, సోనాలి వాకోడేతో మాట్లాడినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దాదాపు 17 నిమిషాల పాటు సాగిన సంభాషణలో కుటుంబానికి తన మద్దతు ఉంటుందని రాహుల్ హామీ ఇచ్చారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, మహారాష్ట్ర కాంగ్రెస్ యువజన విభాగం నేత శివరాజ్ మోరే కూడా ఆ సమయంలో తల్లిదండ్రుల వెంట ఉన్నారు.

### మరణంపై కొనసాగుతున్న దర్యాప్తు

సాహిల్ తల్లిదండ్రులు సెప్టెంబర్ 24 ఉదయం 11 గంటలకు ఐఐటీ బాంబే ప్రధాన గేటు వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపట్టాలని ప్రకటించారు. మరోవైపు సాహిల్ మరణంపై ముంబై పోలీస్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు కొనసాగుతోంది. సెప్టెంబర్ 18న సాహిల్ హాస్టల్ గదిలో మృతిచెందాడు. మిడ్‌సెమిస్టర్ పరీక్షలో మొబైల్ ఫోన్ ద్వారా చాట్‌జీపీటీ ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన కొద్ది గంటలకే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. కుల వివక్ష కారణంగా ఆత్మహత్యకు ప్రేరేపించారనే ఆరోపణలతో నమోదైన ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించిన ఫ్యాకల్టీ సభ్యుడు సూర్యనారాయణ దూళ్లాను నిష్పక్షపాత దర్యాప్తు కోసం సెలవుపై పంపించారు. పరీక్షా హాల్లో సాహిల్ కదలికలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు కూడా తాజాగా కొన్ని టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి.



## ఐఐటీ ముంబై విద్యార్థి తల్లిదండ్రుల దీక్ష

**▪ సాహిల్ మరణంపై ఆజాద్ మైదాన్‌లో పోరు**

ఐఐటీ బాంబే విద్యార్థి సాహిల్ వాకోడే మృతిపై నిరసనలు కొనసాగుతున్నాయి. సాహిల్ తల్లిదండ్రులు గురువారం ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో నిరాహార దీక్ష ప్రారంభించారు. తమ కుమారుడిని వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తండ్రి రవీంద్ర డిమాండ్ చేశారు. సాహిల్ తనకు సంస్థలో పలుమార్లు కుల వివక్ష ఎదురైందని చెప్పేవాడని ఆయన తెలిపారు. రవీంద్ర, ఆయన భార్య సోనాలి ముంబైలో జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ కుమారుడి మరణంపై దర్యాప్తును వేగవంతం చేయాలని కోరారు. దోషులుగా తేలిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### మిడ్-సెమిస్టర్ పరీక్షలు వాయిదా

విద్యార్థి మరణం తర్వాత క్యాంపస్‌లో నిరసనలు పెరగడంతో ఐఐటీ బాంబే కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 26, 27న జరగాల్సిన మిడ్‌సెమిస్టర్ పరీక్షలను అక్టోబర్ 10, 11కు వాయిదా వేసింది. సాహిల్ మరణానికి ముందు పరీక్షలో చాట్‌జీపీటీ ఉపయోగిస్తున్నట్లు గుర్తించారని గతంలో సంస్థ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అయితే ఆ ప్రకటనపై వివాదం చెలరేగడంతో సంస్థ తాజాగా మరోసారి క్షమాపణలు చెప్పింది. మరణానికి దారితీసిన పరిస్థితులు ప్రస్తుతం సంబంధిత అధికారుల దర్యాప్తులో ఉన్నాయని, అవి అధికారికంగా నిర్ధారించకముందే వివరాలను పేర్కొనడం సరైంది కాదని ఐఐటీ బాంబే స్పష్టం చేసింది.

### దర్యాప్తు కోసం పెరుగుతున్న డిమాండ్లు

రెండో సంవత్సరం బీటెక్ విద్యార్థి అయిన సాహిల్ సెప్టెంబర్ 18న సాయంత్రం హాస్టల్ గదిలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ ఎంపీ వర్షా గైక్వాడ్ డిమాండ్ చేశారు. సాహిల్ కుటుంబానికి సంఘీభావంగా ఐఐటీ బాంబే వద్ద నిరసనకు వెళ్లిన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ ఐఐటీ డైరెక్టర్, మరో ప్రొఫెసర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. విద్యార్థులు కులం, మతం కారణంగా అవమానాలు ఎదుర్కొంటున్నారని గైక్వాడ్ ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై దర్యాప్తు పూర్తయ్యే వరకు వాస్తవాలు నిర్ధారించాల్సి ఉంది.

## సర్ వెనక్కి తీసుకోవాలి!

**▪ కురైషీ సంచలన వ్యాఖ్యలు**




మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై. కురైషీ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ చట్టవిరుద్ధమని, దాన్ని వెనక్కి తీసుకోవాల్సిందేనని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన 'ది డిలిమిటేషన్ డిబేట్: ది యూనియన్ అండ్ ఇట్స్ యూనిట్స్' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితా స్వచ్ఛంగా ఉండటం చట్టపరమైన అవసరమని, గత 75 ఏళ్లుగా ఎన్నికల కమిషన్ ఈ ప్రక్రియను కొనసాగిస్తోందని గుర్తుచేశారు. ప్రస్తుతం జరుగుతున్న సర్ విధానం మాత్రం అనుమానాస్పదంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల కమిషనర్ల మధ్య ప్రక్రియపై విభేదాలు బయటపడటం ఈ అంశాన్ని మరింత తీవ్రం చేసిందన్నారు.

### సర్, డీలిమిటేషన్‌పై ప్రతిపక్ష ఆరోపణలు

సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ సర్, డీలిమిటేషన్ రెండూ పరస్పరం ముడిపడి ఉన్న అంశాలని ఆరోపించారు. అధికార పార్టీకి రాజకీయంగా అనుకూలంగా ఉండేలా ఈ ప్రక్రియలను రూపొందిస్తున్నారనే అనుమానం ఉందన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జావేద్ ఖాన్ కూడా డీలిమిటేషన్ వెనుక రాజకీయ పరిణామాలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఇవి ప్రతిపక్ష నేతల ఆరోపణలు, అభిప్రాయాలు మాత్రమే. మరోవైపు, డీలిమిటేషన్‌ను కేవలం ఉత్తరాది-దక్షిణాది వివాదంగా చూడకూడదని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. చిన్న రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలకు కూడా ఆందోళనలు ఉన్నాయని, కేంద్రం విస్తృత సంప్రదింపులు జరపాల్సి ఉందన్నారు.

### అక్టోబర్ 11పై కాంగ్రెస్ దృష్టి

డీలిమిటేషన్‌కు సంబంధించిన బిల్లులను అక్టోబర్ 11 ప్రాంతంలో నవరాత్రి సమయంలో తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలను ప్రభుత్వం ఇంకా ప్రోరోగ్ చేయలేదని ఆయన తెలిపారు. 2011 జనగణన ఆధారంగా డీలిమిటేషన్ తర్వాత మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసే రాజ్యాంగ సవరణకు ప్రభుత్వానికి ప్రస్తుతం మూడింట రెండొంతుల మెజారిటీ లేదని కూడా ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో సర్ చట్టబద్ధత, ఓటర్ల హక్కులు, డీలిమిటేషన్, రాష్ట్రాల ప్రాతినిధ్యం కీలక చర్చాంశాలుగా మారాయి. ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థపై విస్తృత సంప్రదింపులు అవసరమనే అభిప్రాయాలు సమావేశంలో వ్యక్తమయ్యాయి.

## సీఈసీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

**▪ ఓటర్ల తొలగింపుపై ప్రియాంక ఆగ్రహం**



వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితాల నుంచి సుమారు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించడం ద్వారా అన్యాయమైన ఎన్నికలకు అవకాశం కల్పించారని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై సీఈసీపై క్రిమినల్ కేసు నమోదు చేసి, దేశద్రోహం కింద విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వయనాడ్‌లో గురువారం మీడియాతో మాట్లాడిన ఆమె.. ఎన్నికల ప్రజాస్వామ్య ప్రక్రియతో ఎవరైనా చెలగాటమాడితే అది దేశానికి వ్యతిరేకమైన చర్యగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు.

### సర్‌పై కమిషనర్ల అభ్యంతరాలు

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) సమయంలో పేర్ల తొలగింపుపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు మీడియా కథనాలను ప్రియాంక ప్రస్తావించారు. నిర్ణయాలు తీసుకునే విధానంపై కూడా వారు గత కొన్ని నెలల్లో 14 సార్లు ప్రశ్నలు లేవనెత్తినట్లు వచ్చిన వార్తలను ఆమె ప్రస్తావించారు. ఓటర్ల జాబితాల్లో మార్పులు చేయడం ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైన నేరపూరిత చర్యగా ఆమె అభివర్ణించారు. అయితే ఇవన్నీ ప్రస్తుతం కాంగ్రెస్ నేత చేసిన ఆరోపణలు మాత్రమేనని, వాటిపై సంబంధిత అధికారిక విచారణ ఫలితాలు వేరుగా ఉండవచ్చని గమనించాలి.

### చట్టపరమైన రక్షణపై ప్రశ్నలు

అక్రమ చర్యలు జరిగాయని తేలితే సీఈసీకు ప్రత్యేకమైన చట్టపరమైన రక్షణ ఎందుకు ఉండాలని ప్రియాంక ప్రశ్నించారు. ఇతర వ్యక్తుల మాదిరిగానే నేరపూరిత చర్యలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే చట్ట ప్రకారం విచారణ, ప్రాసిక్యూషన్ జరగాలని అన్నారు. తన సహచర కమిషనర్లు సమస్యలను సీఈసీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా అన్యాయమైన ఎన్నికలకు ఉద్దేశపూర్వకంగా అవకాశం ఇచ్చినట్లు తేలితే చర్యలు తప్పవని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ఇప్పటికే విపక్షాల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రియాంక వ్యాఖ్యలు సర్, ఓటర్ల హక్కులు, ఎన్నికల కమిషన్ బాధ్యత అంశాలపై రాజకీయ చర్చను మరింత తీవ్రం చేశాయి.



## ఎన్నికల సంస్కరణలపై సీజేపీ సమరం

**▪ ఓటు హక్కు రక్షణే లక్ష్యంగా ఉద్యమం**

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఎన్నికల సంస్కరణల అంశాన్ని ప్రధానంగా తీసుకోవాలని నిర్ణయించింది. ఎన్నికల కమిషన్ పనితీరుపై తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో పార్టీ కీలక ప్రకటన చేసింది. సెప్టెంబర్ 24న జరగాల్సిన కార్యక్రమాలను రద్దు చేసి, ఢిల్లీలో మధ్యాహ్నం 12 గంటలకు "భారత ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయడం" పేరుతో సీజేపీ నాయకత్వం మీడియా సమావేశం నిర్వహించనుంది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే "ఎలక్షన్ కమిషన్ ఠీక్ కరో" అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఎన్నికల కమిషన్‌లో సంస్కరణల కోసం తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన సంకేతమిచ్చారు.

### కమిషన్‌లో విభేదాలపై దుమారం

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో ఓటర్ల జాబితాల పరిశీలనపై ఎన్నికల కమిషన్‌లో విభేదాలు బయటపడటం ఈ వివాదానికి కేంద్రంగా మారింది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సార్లు కొన్ని నిర్ణయాలు, ఆదేశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు మీడియా కథనాలు వెలువడ్డాయి. ఓటర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణలు, ఓటరు నమోదు ప్రక్రియలో మార్పులపై ఈ అభ్యంతరాలు వచ్చినట్లు సమాచారం. మరోవైపు, ఎన్నికల కమిషన్ వర్గాలు మాత్రం సర్ సహా అన్ని నిర్ణయాలు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆమోదంతో ఏకగ్రీవంగానే తీసుకున్నామని స్పష్టం చేశాయి.

### ఓటు హక్కే మార్పుకు ఆయుధం

సీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ ఎన్నికలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, గిరిజన విద్య, నిరుద్యోగం, మౌలిక వసతులు, పరీక్షల అక్రమాలపై ఎన్ని ఉద్యమాలు చేసినా ఓటు హక్కు రక్షించబడకపోతే ప్రయోజనం ఉండదని అన్నారు. ఎన్నికల ద్వారా ప్రజలు ప్రభుత్వాలను మార్చే అవకాశం కోల్పోతే వ్యవస్థలో మార్పు ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఇదే సమయంలో ప్రతిపక్షాలు సర్‌ను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ పరిణామాలతో ఎన్నికల కమిషన్ స్వతంత్రత, ఓటర్ల జాబితాల పారదర్శకత, ఓటు హక్కు పరిరక్షణ అంశాలు మరోసారి జాతీయ స్థాయిలో చర్చకు వచ్చాయి.

## సీఈసీ తొలగింపుపై విపక్షాల పోరు

**▪ రెండు సభల్లో కొత్తగా నోటీసులు**




ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తొలగింపునకు కొత్త నోటీసులు ఇవ్వాలని విపక్షాలు నిర్ణయించాయి. లోక్‌సభ, రాజ్యసభల్లో ఈ నోటీసులు తీసుకురావాలని భావిస్తున్నాయి. ఇప్పటికే ఏప్రిల్ 24న రాజ్యసభలో సమర్పించిన నోటీసు ఇంకా పెండింగ్‌లో ఉంది. ఎన్నికల కమిషన్‌లో తాజాగా వెలుగుచూసిన పరిణామాల నేపథ్యంలో మరిన్ని ఆరోపణలను చేర్చి కొత్త ప్రతిపాదన తీసుకురావాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. విపక్ష పార్టీల మధ్య దీనిపై చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలో ఇండియా కూటమి సమావేశం జరిగే అవకాశం ఉందని సమాచారం. సీజేపీ ఇచ్చిన 48 గంటల గడువు నేపథ్యంలో ఈ అంశంపై ఆలస్యం చేయకూడదని విపక్షాలు భావిస్తున్నాయి.

### ఏకతాటిపైకి రావాలని టీఎంసీ పిలుపు

తృణమూల్ కాంగ్రెస్ కూడా ఈ వ్యవహారంపై వేగంగా స్పందించాలని కోరింది. జ్ఞానేశ్ కుమార్ తొలగింపునకు గతంలో రూపొందించిన రెండు నోటీసుల్లో టీఎంసీ కీలక పాత్ర పోషించింది. కొత్త నోటీసును వీలైనంత త్వరగా తీసుకురావాలని రాజ్యసభ ఎంపీ డెరిక్ ఓబ్రెయిన్ అన్నారు. విపక్షాలు ఐక్యంగా, వేగంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మార్చి 12న తొలిసారి 63 రాజ్యసభ, 130 లోక్‌సభ సభ్యుల సంతకాలతో తొలగింపు నోటీసు ఇచ్చారు. అందులో సీఈసీ నియామక ప్రక్రియ, గత ప్రభుత్వ పదవులపై ఏడు ఆరోపణలు ఉన్నాయి. ఈ నోటీసును ఏప్రిల్ 7న రెండు సభల ప్రిసైడింగ్ అధికారులు తిరస్కరించారు.

### ఏప్రిల్ నోటీసులో తొమ్మిది ఆరోపణలు

ఏప్రిల్ 24న 73 మంది విపక్ష సభ్యుల సంతకాలతో రాజ్యసభలో మరో నోటీసు సమర్పించారు. ఎన్నికల నియమావళి అమలులో అసమానతలు, టీఎంసీపై ఈసీ సోషల్ మీడియా పోస్టు, బీజేపీతో సంస్థాగత సాన్నిహిత్యంపై ఆరోపణలు, ప్రతిపక్ష ఫిర్యాదులను పట్టించుకోకపోవడం వంటి అంశాలను అందులో ప్రస్తావించారు. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌లో "భారీ స్థాయిలో ఓటర్ల హక్కుల తొలగింపు" జరిగిందనే ఆరోపణలు, తమిళనాడులో అధికారుల బదిలీల విషయంలో అధికార దుర్వినియోగం వంటి అంశాలను కూడా నోటీసులో పేర్కొన్నారు. ఆ నోటీసు ప్రస్తుతం రాజ్యసభ చైర్మన్ సి.పీ. రాధాకృష్ణన్ వద్ద పెండింగ్‌లో ఉంది.

## "వోట్ చోరీ"పై బీజేపీ ఎదురుదాడి

**▪ యాంటీ ఇన్‌కంబెన్సీపై ప్రశ్నలు**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ "వోట్ చోరీ" ఆరోపణలకు బీజేపీ గట్టి సమాధానం ఇచ్చింది. ఢిల్లీలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది స్పందించారు. పలు రాష్ట్రాల్లో యాంటీ ఇన్‌కంబెన్సీ కనిపించకుండా పోయిందన్న రాహుల్ వాదనకు చారిత్రక ఆధారాలు లేవని ఆయన అన్నారు. తమిళనాడులో 1967 తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని, పశ్చిమ బెంగాల్‌లో 1977 తర్వాత, బీహార్‌లో 1990 తర్వాత, ఉత్తరప్రదేశ్‌లో 1989 తర్వాత కాంగ్రెస్ అధికారంలో లేదని గుర్తుచేశారు. ఒడిశాలో 1999 తర్వాత కాంగ్రెస్ అధికారానికి దూరంగా ఉందని తెలిపారు. ఈ వివరాలను ఆధారంగా చేసుకుని రాహుల్ వాదనను త్రివేది ప్రశ్నించారు.

### సర్ వివాదంపై ఈసీ స్పష్టీకరణ

ఈ రాజకీయ ఘర్షణకు కేంద్రంగా సర్ ఓటర్ల జాబితా సవరణ వ్యవహారం నిలిచింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రకారం ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సార్లు పలు నిర్ణయాలపై అభ్యంతరాలు నమోదు చేశారు. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, పునరుద్ధరణ, ఫామ్ 6 మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఓటర్ల డేటాబేస్‌ను కేంద్రీకరించడంపై కూడా వారు ప్రశ్నలు లేవనెత్తినట్లు నివేదిక పేర్కొంది.

## సీఈసీపై కోర్టు ధిక్కరణ పిటిషన్

**▪ అటార్నీ జనరల్ అనుమతికి దరఖాస్తు**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించేందుకు సుప్రీం కోర్టు న్యాయవాది బ్రజేష్ సింగ్ అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా అనుమతి కోరారు. ఎన్నికల కమిషన్‌లో ముగ్గురు సభ్యుల మధ్య ఏకాభిప్రాయం దెబ్బతిన్నట్లు వచ్చిన మీడియా కథనాల ఆధారంగా ఈ చర్యకు సిద్ధమయ్యారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనాన్ని ప్రస్తావిస్తూ, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సార్లు లిఖితపూర్వక అభ్యంతరాలు వ్యక్తం చేశారని న్యాయవాది పేర్కొన్నారు. ఈ పరిణామాలు ఎన్నికల కమిషన్ వ్యవస్థలో తీవ్రమైన అంతర్గత విభేదాలను సూచిస్తున్నాయని ఆయన వాదించారు.

### సర్ నిర్ణయాలపై తీవ్ర అభ్యంతరాలు

ఓటర్ల నమోదు సాఫ్ట్‌వేర్‌లో విస్తృత మార్పులు, ఫామ్ 6లో మార్పులు, సర్ సమయంలో ఓటర్ల పేర్ల తొలగింపు, పునరుద్ధరణ వంటి కీలక చర్యలు తమకు తెలియకుండా, పూర్తి కమిషన్ అనుమతి లేకుండా జరిగాయని ఇద్దరు కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు బ్రజేష్ సింగ్ తెలిపారు. ఈ చర్యలు అనధికారికం, చట్టవిరుద్ధం అంటూ వారు ప్రశ్నించినట్లు పేర్కొన్నారు. సీఈసీ చర్యలు సుప్రీంకోర్టు గత తీర్పులకు విరుద్ధంగా ఉన్నాయని ఆయన వాదించారు. ముఖ్యంగా టి.ఎన్. శేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పులు ఎన్నికల కమిషన్ సంస్థాగత సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని స్పష్టం చేశాయని గుర్తుచేశారు.



### "సీఈసీ అందరికంటే పైవారు కాదు"

సీఈసీకి సంపూర్ణ అధికారం ఉండదని, ఆయన "సమానుల్లో మొదటి వ్యక్తి" మాత్రమేనని న్యాయవాది పేర్కొన్నారు. సహ కమిషనర్లను పక్కనపెట్టి, పూర్తి కమిషన్ పేరుతో నిర్ణయాలు జారీ చేయడం సుప్రీంకోర్టు నిర్దేశించిన చట్టాన్ని ఉద్దేశపూర్వకంగా ధిక్కరించినట్లవుతుందని ఆయన ఆరోపించారు. బహుళ సభ్యుల స్వతంత్ర రాజ్యాంగ సంస్థను ఒకే వ్యక్తి ఆధీనంలోకి తీసుకెళ్లడం సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల సూత్రానికి ముప్పు కలిగిస్తుందని అన్నారు. అయితే కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేయడానికి ముందుగా భారత అటార్నీ జనరల్ అనుమతి తప్పనిసరి.

## ఆపన్న కుటుంబానికి అండగా ఫౌండేషన్ సభ్యులు



కొనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి 'నా కలం అక్షర సత్యం ఫౌండేషన్' అండగా నిలిచింది. కుటుంబ పెద్ద కొమ్ము నర్సయ్య ఇటీవల మృతిచెందడంతో భార్య నర్సవ్వ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించి 50 కేజీల బియ్యంతో పాటు 10 రకాల నిత్యావసర సరుకులను కుటుంబానికి అందజేశారు. గ్రామ సర్పంచ్ గుండా వెంకటేష్ గౌడ్, మానాల ఉపసర్పంచ్ దాసరి అశోక్, గ్యారె శేఖర్, వడ్డేపల్లి రాజేందర్ చేతుల మీదుగా సరుకులను అందించారు. అనంతరం నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి, వారి దుఃఖంలో భాగస్వాములై ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో నిరుపేద కుటుంబానికి అండగా నిలవడం ద్వారా ఫౌండేషన్ మానవత్వాన్ని చాటుకుంది. ఆపదలో ఉన్న కుటుంబాలకు భవిష్యత్తులోనూ సహాయం అందిస్తామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమ్ము దేవరాజు, కొమ్ము రాజు, చెప్పాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఐటీ ప్రాంగణ ఎంపికల్లో 15 మందికి ఉద్యోగాలు



ప్రొద్దుటూరులోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన ట్యాప్ అకాడమీ సంస్థ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి శిక్షణార్థి ఉద్యోగాల కోసం బీటెక్ చివరి సంవత్సరం సీఈఎస్, ఈసీఈ, ఈఈఈ, ఏఐఎంఎల్ విద్యార్థులకు ఎంపికలు నిర్వహించింది. ఇందులో సీఈఎస్ నుంచి నలుగురు, ఈసీఈ నుంచి ఎనిమిది మంది, ఈఈఈ నుంచి ఇద్దరు, ఏఐఎంఎల్ నుంచి ఒకరు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.3 లక్షల వేతన ప్యాకేజీ లభించనుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి, శిక్షణ ఉద్యోగ నియామకాల అధికారి నజీర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వీర కుమార్‌రెడ్డి, కార్యదర్శి వీర కళ్యాణ్‌రెడ్డి, ఉపప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.వెంకటేశ్వరరెడ్డి, విభాగాధిపతులు అభినందించారు. విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాల కోసం నిరంతరం ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## వృద్ధుల సంక్షేమమే పాలక మండలి లక్ష్యం




ప్రొద్దుటూరులోని మెయిన్ బజార్ అమ్మవారిశాలలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి తల్లం వీరయ్య శ్రేష్ఠి మెమోరియల్ వృద్ధాశ్రమం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. అధ్యక్షుడిగా కామిశెట్టి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా కాకుమాని సుబ్బారావు, కార్యనిర్వహక కార్యదర్శిగా మురికి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పసుపుల సుబ్రమణ్యం, సహాయ కార్యదర్శిగా వెంకట నరసింహారావు, ఖజాంచీగా తల్లం వెంకట ద్వారకానాథ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గ సభ్యులుగా జొన్నలగడ్డ రవీంద్ర బాబు, సీవీ సురేష్ మరో ఇద్దరు ప్రమాణం చేశారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్ రావు మాట్లాడుతూ వృద్ధాశ్రమ అభివృద్ధితో పాటు వృద్ధులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన పాలక మండలి ఆప్యాయతతో సేవలందిస్తామని, తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ సభ్యులు పాల్గొన్నారు.

# జనసేనకు చేరికల జోష్





### నారపరెడ్డిపల్లిలో 150 కుటుంబాల చేరిక

రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని నారపరెడ్డిపల్లిలో జనసేనకు 150కుపైగా కుటుంబాలు చేరాయి. గ్రామ నాయకుడు కొంగాణి రఘు యాదవ్ ఆధ్వర్యంలో మహిళలు, యువతతో పాటు ఆయన అనుచరులు జనసేనలో చేరారు. రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్ చార్జి యల్లటూరు శ్రీనివాసరాజు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. యల్లటూరు శ్రీనివాసరాజు నాయకత్వం, నియోజకవర్గ అభివృద్ధిపై ఆయన దృష్టికోణంపై నమ్మకంతో పార్టీలో చేరుతున్నట్లు రఘు యాదవ్ తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారం, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం తమను ఆకర్షించాయని కొత్తగా చేరిన వారు పేర్కొన్నారు.స్థానిక సమస్యలపై దృష్టికొత్తగా చేరిన వారికి యల్లటూరు శ్రీనివాసరాజు పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. పార్టీలో ప్రతి ఒక్కరికీ గౌరవం కల్పిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములను చేస్తామని చెప్పారు. రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, యువతకు ఉపాధి అవకాశాలపై ప్రత్యేకంగా పనిచేస్తామని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే వ్యవస్థను నిర్మిస్తామని స్పష్టం చేశారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది

## వేంపల్లిలో ఎస్ ఐఆర్ పై క్షేత్రస్థాయి పరిశీలన



వైఎస్సార్ కడప జిల్లాలో ఎస్ ఐఆర్-2026 ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను జిల్లా పరిశీలకులు చేతన్ టి.ఎస్. (ఐఏఎస్) క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేంపల్లి మండల పర్యటనలో భాగంగా నందిపల్లి పీఎస్-217, వేంపల్లి రాజీవ్ నగర్ పీఎస్-230, 231 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో జరుగుతున్న సవరణ ప్రక్రియపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు, ఓటర్ల జాబితా, ఫారం-6, ఫారం-7, ఫారం-8 క్లెయిమ్ లను పరిశీలించి, వాటి పరిష్కార ప్రక్రియపై అధికారుల నుంచి సమాచారం సేకరించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లతో నేరుగా మాట్లాడి ఎస్ ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, క్లెయిమ్ ల పరిశీలనలో నిబంధనలు పాటించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో పులివెందుల ఆర్డీవో, వేంపల్లి ఎంఆర్ ఓ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్, వేంపల్లి ఆర్ ఐతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేత వర్గాలకు చైర్మన్ పదవి ఇవ్వాలి




ప్రొద్దుటూరులో చేనేత వర్గాలకు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవి కల్పించాలని మాజీ బీసీ కౌన్సిలర్లు, వైసీపీ బీసీ నాయకులు డిమాండ్ చేశారు. దొరసానిపల్లెలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పద్మశాలీ, తొగట వీర క్షత్రియ, దేవాంగ తదితర చేనేత వర్గాలు ఐక్యంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఏ పార్టీ చేనేత వర్గానికి చైర్మన్ అవకాశం ఇచ్చినా పార్టీలకతీతంగా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని రాచమల్లుకు వివరించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. గతంలో బీసీలకు పలు కార్పొరేషన్ పదవులు దక్కాయని గుర్తుచేస్తూ, బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా రాజకీయ భాగస్వాములుగా గుర్తించాలని కోరారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, మాజీ కౌన్సిలర్లు పిట్టా బాలాజీ, పిట్టా భద్రమ్మ, అనిల్, బీసీ నాయకులు పాల్గొన్నారు.



## ఈశ్వరమ్మ నేత్రదానంతో ఇద్దరికి వెలుగు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పెద్దమ్మ భూమిరెడ్డి ఈశ్వరమ్మ (90) మరణానంతరం నేత్రదానం చేసి మానవతా స్ఫూర్తిని చాటారు. పులివెందులకు చెందిన ఈశ్వరమ్మ బుధవారం రాత్రి వయోభారంతో కన్నుమూశారు. ఆమె మరణించిన అనంతరం కుటుంబ సభ్యులు నేత్రదానానికి సమ్మతించారు. కుటుంబం అంగీకారంతో స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం ప్రతినిధులు ఈశ్వరమ్మ కార్నియాలను సేకరించారు. అనంతరం వాటిని హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి తరలించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు కల్పించే అవకాశం ఉందని సేవాసమితి ప్రతినిధులు తెలిపారు. మరణానంతరం కూడా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం కల్పించడంపై కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. వయోభారంతో మృతి చెందిన ఈశ్వరమ్మ నేత్రాలను దానం చేయడం ద్వారా కుటుంబ సభ్యులు ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. నేత్రదానం ప్రాధాన్యాన్ని గుర్తించిన కుటుంబ నిర్ణయాన్ని సేవాసమితి ప్రతినిధులు అభినందించారు.

## మానవత కమిటీకి బాలాజీ సారథ్యం



